
కొత్తగా ఎన్నికైన జిల్లా బోర్డు ప్రెసిడెంటు గంటయ్యగారి పుణ్యమా అంటూ రెడ్డిపాలెం గ్రామంలో ఒక ఎలిమెంటరీ పాఠశాల వెలిసింది.

ప్రెసిడెంటుగారి ఆజ్ఞ ప్రకారం ఊళ్లో మోతుబరుల దగ్గర చందాలు వసూలుచేసి, ఆటల్లో గెలుపొందిన పిల్లలకు బహుమతులు ఇచ్చి ఆ సంవత్సరం ఆరోగ్యవారం జరిపించారు హెడ్మాస్టరు జకరయ్య. కాని ఆ బహుమతులన్నీ కింది కులాల వారికే సంక్రమించటంవల్ల ఆ ఊరి పెద్దల్ల ఆధిక్యత చిన్నబుచ్చుకుంది. అంతే. సభ చేసి ఆ యిచ్చిన వస్తువులు వెనక్కి తీసుకుని తమ పిల్లలకి యివ్వవల్సిందనీ లేకుంటే తన్నుతామనీ జకరయ్యను బెదిరించారు. దిక్కుతోచని జకరయ్య ప్రెసిడెంటుగారి శరణు జొచ్చాడు. ఎన్నికలు దగ్గర పడ్డాయి. అందులోనూ తను ఎమ్మెల్యేగా నిలబడబోతున్నాడు.




— కరుణాకుమార్

అంత ముందుచూపు లేకుండా వ్యవహరిస్తాడా ప్రెసిడెంటు? గ్రామం వొచ్చి పరిశీలించి పరిష్కరిస్తాను వెళ్ళమన్నాడు.

గ్రామపెద్దల ఒత్తిడి వల్ల బహుమతులన్నీ వాపసు ఇచ్చేసేరు పిల్లల తల్లిదండ్రులు. ఒక్క టార్చిలైటు పుచ్చుకున్న చాకలి తప్ప. ఆ కుర్రవాడి తండ్రి ఇవ్వకపోగా యిచ్చినవారిని రెచ్చగొట్టాడు. అందరూ కత్తులూ, కటార్లూ పట్టుకుని పెదరెడ్డి ఇంటి మీద పడ్డారు. అరాచకం చెలరేగింది.

ప్రెసిడెంటుగారు గ్రామం వొచ్చి రెడ్డిగారింట విందారగించి వెళ్లిపోయారు.

ఊళ్ళో అరాచకం రేపిన కారణంగా జకరయ్యను ఉద్యోగం నుంచి బర్తరఫు చేసినట్టు గంటయ్యగారి సంతకంతో జిల్లా బోర్డు ఆఫీసు నుంచి తాఖీదు వచ్చింది. *

## కాలందొలుని కథలు

### టిట్ ఫార్ టాట్

అన్ని వూళ్ళల్లోని బస్సుల్లో వున్నట్టే వాల్తేరు సిటీ బస్సుల్లోనూ 'పొగ త్రాగరాదు' బోర్డుంటుంది. అయితే అన్ని నిబంధనల్లాగే అదీ ఎవరూ పాటించరు.

పైగా ఆ నియమోల్లంఘన కావాలనే చేసినట్టు, కొందరు కుఱ్ఱకారు బస్సెక్కగానే సిగరెట్ ముట్టిస్తారు.

ఇక యూనివర్సిటీ వుమెన్ స్టూడెంట్స్ వున్నప్పుడు, ఇక ఆ అల్లరి మరీ ఘోరంగా వుంటుంది.

కండక్టరు, పాసింజర్లూ ఎవరూ పట్టించుకోరు, మనకెందుకొచ్చిందిలే, గొడవ అన్నట్టు!

ఒకరోజు ఓ సిటీ బస్సులో ఓ అమ్మాయి ఇంగ్లీషు నవల చదువుతూ సిటీబస్సుల్లో కూర్చునివుంది. ఆమె ఎదురు సీటులో ఓ రంగేళీ స్టూడెంట్ కూర్చుని, ఎనిమిది అంగుళాల కింగ్ సైజ్ స్పెషల్ సిగరెట్ ముట్టించి, రింగుమని తిరిగే పొగ మేఘాలు ఆ అమ్మాయి మీదకు వదులుతూ, ఏమి ఎరగనట్టు కూని రాగాలు తీస్తున్నాడు.

పాపం ఆ ఇంగ్లీష్ నవల చదివే అమ్మాయికి ఆ వాసన పడక తలనొప్పి అనిపించినా, ఆ విషయం పైకి చెప్పలేక నోరు నొక్కుకుంది. చెప్పినా లాభం వుండదు.

తన బాధ ఆ రంగేళీ స్టూడెంట్ అర్థంచేసుకుంటాడేమోనని, సిగరెట్ పారేస్తాడేమోనని ఆ అమ్మాయి చూసింది! కాని ప్రయోజనం లేకపోగా, చెయిన్‌స్మోకింగ్‌కి దిగాడు ఆ స్టూడెంట్! కాస్సేపటికి బస్సు నిండింది. బస్సు కదలబోతుండగా—

ఇంతలో పెద్ద చేపల తట్టతో ఒక అప్పలమ్మ ఎక్కింది. ఆమెను వెంటనే తన ప్రక్కన కూర్చోమని చోటిచ్చిన ఆ అమ్మాయి, "ఏదీ, మీరు అడ్డు చుట్టలెలా కాలుస్తారో చూడాలి ముట్టించు!" అంది.

'మాతల్లే... ఇంకా కోప్పడతావేమోనని ఆగాను' అన్నట్టు ఆ అప్పలమ్మ విషయం తెలుసుకొని నాటు పొగాకు చుట్ట ముట్టించి, బొగ్గు యింజనులా పొగను, రంగేళీ రాజా ముఖాన ఊదసాగింది.

—ఎం.డి.సౌజన్య

ఆరోజు ఆదివారం- "ప్రతీకారం" పిక్చర్ చూద్దామని నేనూ నా మిత్రుడు రామిరెడ్డి థియేటర్ దగ్గరికి వెళ్ళాము. క్యూ- లైను చదిలా చాలా పొడవుగా ఉంది. అయినా గొడవలు లేక ప్రశాంతంగా ఉండటం చేత టిక్కెట్లు దొరుకుతాయన్న ధైర్యంతో క్యూలో నిలుచున్నాం.

టిక్కెట్లు తీసుకొని థియేటర్‌లో అడుగు పెట్టేప్పటికి పిక్చర్ స్టార్ట్ అయింది. ఖాళీ సీట్లకోసం మా కళ్ళు వెతుకుతున్నాయ్.

హాయ్ బ్రదర్! ఐయామ్ లక్కీ! అటు చూడు! అదీ అమ్మాయి ప్రక్క సీటు- ఖాళీ సీటు ఆ సీటు యిక నాదే. ఇక నీవు వెళ్ళి నీ లక్కుని పరీక్షించుకో- అంటూ వెళ్ళబోయాడు. "ఛ... ఎవరైనా వస్తారేమో!" అంటూ ఆపబోయాను". టికెట్ కొన్నాక ఖాళీగా ఉన్న సీటులో కూర్చునే హక్కు ప్లస్ ధైర్యం నాకుంది. ఆ అమ్మాయిని అడిగే ప్రసక్తే నాకు లేదు. నన్నాపే శక్తి ధైర్యం ఆ ఆటంకి ఉన్నప్పుడు చూద్దాం" అంటూ

## నడ్డివిరిగిన రెడ్డి



—గాధిరాజు మధుసూదనరాజు

గబగబా వెళ్ళి పోయాడు. కళ్ళు ఇంకా మసక మసగ్గానే కనిపిస్తున్నాయ్ (డార్క్ అడాప్టేషన్ కారణంగా).

రామిరెడ్డి వెళ్ళి విసురుగా కుర్చీలో కూర్చున్నాడు.

అంతే! థన్ మన్న శబ్దం- అమ్మాయిగారి కిలకిల అన్న నవ్వుల సవ్వడి. అంతలోనే జనం లేవడంతో అలజడి.

గబగబా నేనూ పరిగెత్తి చూశా. ఇంకేముంది. రామిరెడ్డి పాపం! కుర్చీలో ఇరుక్కుపోయి ఉన్నాడు.

"అయ్యో! అసలు దీనికి సీటే లేదండీ! అడిగితే చెప్పేదాన్నిగా! మొన్న పోకిరీ స్టూడెంట్లు సమ్మె గిమ్మె అంటూ- దాడి చేసి విరగ్గొట్టారట. నా ప్రక్క సీటు బామ్మ చెప్పింది".

"ప్చ్... పాపం!" అంటూ నిట్టూర్చింది ప్రక్క సీటులోని అమ్మాయి.

దెబ్బ తగలడంతో నడ్డి విరిగిన రెడ్డికి అహం దెబ్బతింది కాబోలు- "సారీ" అంటూ చెప్పేందుకు నాల్క తిరుగలేదు. *